# అరిసెల ఆరాటం

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

చంద్రంకు అరిసెలంటే అతి యిష్టం మహా యిష్టం. అస్తమానూ వాటిని తల్చుకొని తెగ ఊరిపోతూంటాడు. ఆరోజు స్కూల్లో పిల్లలికి 'శశిరేఖాపరిణయం' పాఠం చెబుతూ "పెళ్లికిముందుగా అరిసెలు చేస్తారు. ఆ ఘటోత్కచుడు అరిసెలన్నీ పూర్తిగా ఆరగించాడు... అరిసెలకోసం ఆరాటపడని మానవులుండరు" అనేశాడు. అప్పటినుంచీ యింటికిరాగానే తనభార్య సుధ చేత అరిసెలు చేయించుకు తినాలని గబగబావచ్చేశాడు. వచ్చీరాగానే "సుధా! ఇవ్వాళ అరిసెలు చేస్తావా ?" అనడిగాడు.

"మీకేం పనిలేదేమో! అస్తమానూ అరిసెలయాన తప్పించి మరోగోడవలేనట్లుంది.."

పాపం చంద్రంకు ఎట్లాగైనా అరిసెలు తినాలని వచ్చేటంత వాంఛగావుంది. భార్య అసమ్మతి కనపర్చడంతో ఆతనికి కోపంవచ్చింది. అయినా తమాయించుకుని "అయితే ఇప్పుడు చెయ్యలేవా?" అనడిగాడు కొంచెందీనంగా.

" అసలే పిల్లలతో ఇప్పటివరకూ చాకిరీతో కొట్టుకు చచ్చిపోతున్నా. నన్నుచూచి జాలిపడేవారెవ్వరూ లేరు ...మీరేమనుకొన్నా సరే; నేనిప్పుడు చెయ్యలేనండీ!"

"నాకిప్పుడే తినాలనివుందే..." ఎంతో ప్రేమగా అడిగాడు.

"వుంటుంది. నాకూవుంటుంది. తేరగా ఎవరైనా చేసిపెడ్తే నాకూ తినాలని వుంటుంది. వెధవ అరిసెలు. పూరికె అవుతాయా? రెండుగంటలసేపు కొట్టు మిట్టాడి చాకిరీ చేస్తేఏదోశాస్త్ర అయిందనిపిస్తారు పిల్లలూ మీరు -కిరాణా కొట్లో క్రిందటి నెల బాకీ యింకా ముప్పయి ఇవ్వాలి-యస్ - ఇ - ఒ - గారిచ్చిన 'హుండీబాక్సు'లో నయాపైసాయైనా యిప్పటికి వెయ్యలేదు. మళ్ళీ ఇప్పుడు అరిసెల కోసం బెల్లం, నూనె, నూపప్పు తెప్పిస్తే...ఈ నెల ఎంత అవుతుందో తెలుసా?...'

'ఇవ్వాల్సిన బాకీలు నేనే తీర్చుకొంటాను కాని మీ పుట్టింటి నుంచి ఏమీ తెచ్చి పెట్టటం లేదులే' అని ఉక్రోశంతో అన్నాడు—

'అమ్మా! అరిసెలు చెయ్యవే' అంటూ గోముగా అడిగాడు కొడుకు భాస్కరం ఎనిమిదేళ్ళవాడు.

'అమ్మా! అరిసెలు ఎంచక్కావుత్తాయి. చెయ్యి' అంటూ నోరూరించుకొంటూ తల్లి ఒళ్ళో కూర్చుని అడిగింది మూడోది నాలుగేళ్ళ మల్లిక.

చంటివాడైన బాబుకి ఇంకా మాటలు రాలేదు కాబట్టి ఏమీ అడగకుండా అందరి ముఖాల్లోకి చూస్తూ కూర్చున్నాడు.

'అయితే యిప్పుడు అరిసెలు చేస్తావా చెయ్యవా'? ఖచ్చితంగా అడిగాడు చంద్రం.

'ఇప్పుడు చెయ్యాలంటే నిల్చున్న పళంగా అరిసెలు ఎల్లా అవుతాయండీ? బియ్యం నానబొయ్యాలి; పిండి కొట్టాలి...కావాలంటే రేపు భోగి పండుగ కాబట్టి తప్పకుండా చేస్తాను. సరేనా?' అంది కొంచెం రాజీకిచ్చి.

'ఇంకా నయం. మా నాన్న తద్దినానికి చేస్తానన్నావు కాదు—ఇవ్వాళ చేస్తే సంక్రాంతి వరకు తినొచ్చు.'

'ఏమిటండీ? మూడు మూణ్నాళ్ళకీ అరిసెలంటూ అలమటిస్తారు? చిన్న పిల్లల కంటే కూడా మీకు జిహ్వాచాపల్యం మరీ ఎక్కువై పోతోంది. మీకు వచ్చే వేమో వందరూపాయలు ఆయె! అన్నీ అందులోనే సర్దుకోలేక నల్గురు పిల్లలతో చాలీ చాలక ఛస్తోంటే...మీకు చూలింతరాలికన్నా మనసులు ఎక్కువై పోతోంటే యింకెల్లాగండీ? పిల్లలు నలుగురికీ సరిగ్గా బట్టలులేక; నామటుక్కి నేను రెండు చీరలతో గడుపుకొంటున్నాను. దసరా దగ్గర నుంచి కొనుక్కోవనటమే కాని ...ఓ గుడ్డ కూడా కొనుక్కోలేక పోతున్నాను. పైగా రోజురోజుకీ యిల్లా టిఫిన్లు చేసుకొంటూంటే...మీ మట్టుక్కి మీరే కాకుండా యింట్లో కూడా దూబరా చేసేస్తే...'

'చాలు చాలించు-యింక నీ లెక్చరు. నాకు అరిసెలు చెయ్యక్కరలేదు; నీ మొహం చెయ్యక్కర్లేదు. నీపాటి యింగిత జ్ఞానం నాకూ వుందిలే. ఏదో కాసిని అరిసెలు చెయ్యమంటే పొదుపు పొదుపు అంటూ గుంజుకుంటు

న్నావ్? ఒక్కపూట నాల్గు అరిసె ముక్కలు చేసుకొంటేనే కాపురం కూలిపోతుందన్నట్లుగా అఘోరిస్తూ, పొదుపును గురించి యిన్సూరెన్సు ఏజెంటులా ప్రారంభించావు......' అంటూ భార్య అక్కడ పెట్టిన కాఫీ గ్లాసును వదలి లేచి వెళ్ళిపోయి పడకకుర్చీలో కూర్చున్నాడు చంద్రం. అతనికి ఎల్లాగైనా అరిసెలు చేయించుకు తినాలని మనస్సులో తహతహలాడ్తోంది.

'చంటాడు ప్రొద్దుట నుంచి చంక దిగక వేధించుకు తింటోంటే; అరిసెలు చెయ్యలేదని అహంకారం వస్తే నేనేం చెయ్యను చెప్పండి?'

'నేనడిగేసరికే నీకెప్పుడూ తీరిక, ఓపిక కూడా వుండదు. ఏదైనా అమ్మవారి నైవేద్యాలొస్తే మాత్రం చచ్చినట్టు చేస్తావు' అంటూ ముఖం కందగడ్డలా చేసుకు అన్నాడు.

'అమ్మా! అరిసెలు చెయ్యవే' అంటూ గారంగా అడిగింది మల్లిక.

'నీకూ మీనాన్నకూ అరిసెలు మనుసయ్యాయ్యేం? రా పెడ్తాను.' అంటూ వీపుమీద ఛెళ్లున అణిచింది సుధ. ఆ చరుపుతో హోరు హోరుమంటూ ఏడ్పుకి లంకించుకొంది మల్లిక. ఆ ఏడ్పులో శివాలెత్తినట్లుగా గంతులు వేస్తోంటే అక్కడే వున్న వేడి వేడి కాఫీ గ్లాసు ఒక్క తాపుతో చంటివాడిమీదికి తన్నింది. వేడి కాఫీకి కాలుకాలి చంటిబాబు గుక్కపట్టి ఏడ్పు లంకించుకొన్నాడు.

'ఛీ! ఛీ!! దరిద్రపు కొంప!!! రెండు అరిసెలు చెయ్యమంటే యింత రాద్ధాంత సిద్ధాంతమా? ఇంక ఈజన్మలో మళ్లీ నిన్ను నేను అరిసెలు వండమంటే మాదిగాడు ఛండాలుడే!' అంటూ అరిచి విసవిసలాడ్తూ వెళ్ళిపోయాడు చంద్రం.

యింట్లో పిల్లలని ఊరుకోబెట్టలేక, వాళ్ళని సముదాయించలేక సతమతమైపోతోంది సుధ.

చంద్రం స్కూలుకి వెళ్ళాడన్నమాటేగాని అతని మనస్సు అరిసెలను తల్చుకొని అతలాకుతలం అయిపోతోంది. వెయిటింగు రూములో తాపీగా ఆలోచించుకొంటూ ఖాళీగా కూర్చున్నాడు చంద్రం. తన్సాదియ్యాతనికి వేడిగావున్న అరిసెలంటే ఎంత యిష్టమో సుధకి తెల్సు. అటువంటప్పుడు అవి చెయ్యకపోతే తనెంత బాధపడ్తాడో ఆమెకి తెలుసుండీ కూడా...ఆడదానికి అంత పట్టుదల అయితే?...ఏమో! చేస్తుందేమో! అబ్బే —అది చెయ్యనంటే చెయ్యదు. ఆడదానికంత కోపమైతే ఆ సంసారం చట్టుబండలైనట్లుగానే వుంటుంది. పైగా నామీద కోపమంతా పిల్లలమీద చూపించి యివిగో అరిసెలంటూ వీపుమీద మోగిస్తుందా?... అలా మళ్ళీ ఆమె వీపుమీద తనే వడ్డిస్తే నాలుగు అరిసెలు?—ఇవ్వాళ సాయంత్రం ఇంటికి వెళ్ళగానే ఆసంగతేదో కనుక్కొంటూ. ఇవ్వాళ అంతుతేల్చి వదుల్తా అనుకొంటూ క్షణికావేశంతో అట్టుడికిపోతున్నాడు చంద్రం.

స్కూల్లో పిల్లలకి పాఠాలు చెబుతూంటే; 'మాష్టారూ! ప్రొద్దుట చెప్పిన పాఠం మళ్ళీ చెప్పండి' అనడిగారు-సరిగ్గా మళ్లీ శశిరేఖా పరిణయం ప్రారంభించి 'పెళ్ళికోసం చేసిన అరిసెలన్నీ స్వాహాచేసాడు ఘటోత్కచుడు' అన్నాడు మామూలు ధోరణిలో-అంతలోనే మళ్ళీ మరచిపోయినా అరిసెలు గుర్తుకువచ్చి, మానేసిన మధ్యాహ్నం కాఫీ జ్ఞప్తికివచ్చి, కడుపులో దేవురించుకుపోయింది చంద్రానికి ఆకలిబాధ.

'అయితే మాష్టారూ! పెళ్ళికి అరిసెలు తప్పించి మరేమీ దొరకలేదుటండీ ఆ ఘటోత్కచుడికి? అదీకాక అన్నీ తినెయ్యడానికి అరిసెలు అంత రుచిగా వుంటాయిటండీ?' అన్నాడు ఆకతాయి ఎస్సెల్సీ స్టూడెంటు.

'ఆ! వెధవ అరిసెలను గురించి అంత గొప్పేముంది?' అన్నాడు మరో బండాభాయీ స్టూడెంటు.

అరిసెలను గురించి నిస్సాకారం చూపించేసరికి చంద్రం మనస్సు గట్టుమీదపడిన చేపలా గిజగిజా కొట్టుకుంది. యింక కోపానికి తట్టుకోలేక అరిసెల్లో వుండే ఆధిక్యతని ప్రత్యేకంగా వాళ్ళకి చెప్పాలని లెక్చరు ప్రారంభించాడు టీచరు చంద్రం.

'ఇదుగో ఆదికాలంనుంచీ పిండివంట లన్నింటిల్లోనూ అరిసెలు అగ్రస్థానం వహించాయి. శ్రీనాథ కవికి అరిసెలంటే మహా యిష్టమని ఓ పద్యంలో వర్ణించి వ్రాసుకొన్నాడు. ఈ అరిసెలు అభాలకీ, శుభాలకీ, పండగలకీ, పబ్బాలకీ, అన్నింటికీ మహారాజపదవి పొందాయి. పెళ్ళి చేసుకోడానికి వీధిలో పందిరికోసం ఒక్కరాట పాతి, మామిడాకు కట్టి, ముందుగా అరిసెల

పిండివంట ప్రారంభిస్తారు. ఆ తర్వాతనే పెళ్ళికూతుర్ని లేక పెళ్ళికొడుకుని చేసి ముత్తయిదువులను పిల్చుకుంటారు. పెళ్ళిలో అరిసె వెయ్యకపోతే శుభప్రదమే కాదు. పెళ్ళి అయ్యాక కూడా ఊరివారందరికీ అరిసెలు పంచి పెడతారు. పెద్దల పేరుతో 'తద్దినం' పెడితే; ఆ పితృదేవతలకి అరిసె ఆరు నెలల గ్రాసమని తప్పక వండుతారు. అరిసెలు వండందే అపర కర్మ కూడా పూర్తికాదు. ఆఖరుకి చంటి పిల్లలు అసుగులు వేస్తోంటే 'అరిసెలు పంచివెడతారు. ఏ చిన్న శుభకార్యమొచ్చినా అరిసెలు నిండైన పిండి వంట, ఆ అరిసెలు ముచ్చటగా దాచుకొని మూణ్నెలయినా తినవచ్చు. అవి మంచి నూనెతో చేస్తే చెడిపోకుండా ఎంతకాలమైనా వుంటాయి. యింక అరిసెల రుచి వర్ణించడానికి...... మానవులకే అసాధ్యం. అరిసెల పాకం, అటుకుల పాకం, అత్తగారి పాకంలోనూ ఎంతో జాగ్రత్త శ్రద్ధ చూపించాలి. లేకపోతే చెడిపోతాయి. అరిసెలుకి సమానంగా బెల్లంతోనో; పంచదారతోనో పాకం పట్టి, కొట్టిన వరిపిండి వేసి, నువ్వు పప్పుపోసి......తప్పాదియ్యా! అవి వేగుంటే ఘుమ ఘుమా కమ్మని వాసనతో ...నోట్లో వేసుకు తింటుంటే (పాపం అట్లా చెబుతూంటేనే చంద్రానికి నోట్లో నీళ్ళూరుతున్నాయి) పనస తొనల్లా మెత్తగా తియ్యగా కరిగిపోతాయి. అన్నం లేకుండా అరిసెలు తిని ఎంత కాలమైనా వుండిపోవచ్చు. వాట్లరుచి అతిమధురం. నోట్లో వేసుకొంటే కరిగిపోతాయి. అసలు ఆరోగ్యానికి ఆనందానికీ కూడా 'అరిసెలు' వారానికోసారైనా తినడం శ్రేష్ఠం.'

'అయితే మీ యింట్లో నూపప్పు నూనె, బెల్లం, పంచదారకి ఖర్చు ఎక్కువే అవుతుందేమో కదండీ మాష్టారూ?' ఓ అమ్మాయి సూటిగా అడిగేసింది.

'ఖర్చుకి ఏదైనా ఒక్కటే. అరిసెలు తిన్నాక యింక అన్నం ఎల్లాగూ తినలేరు. అటువంటప్పుడు ఏదైతే మాత్రం పోయిందేమిటి?' అతని కడుపులో వుండే గాభరా అంతా ఆ ఎస్సెల్సీ విద్యార్థుల ముందు క్రక్కేశాడు చంద్రం.

'నాకు అరిసెలంటే సుతలమూ పిసరంతైనా యిష్టం లేదు మాష్టారూ! వాట్ల పేరు వింటేకూడా నాకు కిట్టదు. నాకు కారం ఇష్టం' అన్నాడు ఓ పొట్టి కుర్రాడు.

'పటప్ అరిసెలంటే అసహ్యించుకొనేవాడీసృష్టిలో వుంటాడంటే నేను నమ్మను. నీకు అవి యింట్లో ఎవ్వరూ చేసిపెట్టకపోవడం చేత బహుశా అవి బాగుండవేమో? అని నువ్వు దురభిప్రాయపడుతున్నావు. అరిసెలు సంగతి నీకు తెలీదేమో!' అన్నాడు తనికి అత్యంత ప్రియమైన అరిసెలను తల్చుకొని గుటకలు మింగే చంద్రం...

'అరిసెముక్క' క్లాసులో తలవొంచుకుని ఏ



విక్రం ప్రొడక్షన్స్‌వారి

"పెళ్ళితాంబూలం"లో

రమణమూర్తి-జమున

కుర్రాడో అన్నాడు. ఆమాట అన్నవాడి నోటినిండా పటికి బెల్లం పెట్టాలన్నంత ప్రీతి కల్గగా, ఎవరన్నారో మాత్రం గుర్తించలేక పోయాడు చంద్రం.

అంతలో ఆ పీరియడ్ పూర్తయిపోయి బెల్ కొట్టారు. చంద్రం క్లాసు నుండి బయటకు వస్తూంటే తస్సాదియ్యా! అరిసె ముక్క! అనే కేకలు అందరి నోటంటా ఆ రూమ్ అంతా ప్రతిధ్వనించేలా వినిపించినా గబగబా నడిచి ఇంకో క్లాసుకి వెళ్ళిపోయాడు చంద్రం.

'స్కూలు వదిలిపెట్టగానే ఇంటికి వచ్చే చంద్రంకు వెనక్కాల వానర సైన్యంలా కొంటె పిల్లలు 'అరిసె ముక్క' అంటూ ఉడికించి అరుపులు ప్రారంభించారు. చంద్రం కూడా తనలో ఉడికిపోతున్నాడు. యింతమంది నోట్లో తన అరిసెలను గురించి...... ఇంక ఏమైనాసరె యింటికి వెళ్ళి అరిసెలు చేయించుకు తినాలి. తనని అరిసెల తిండిపోతు అన్నా సరే; ఎందరు ఎంత హేళనచేసినాసరే; కడకు విధం చెడ్డా ఫలం దక్కాలి! ఎలాగైనా అరిసెలు చేయించుకు తినాలి. అసలు అరిసెలు ఎందుకు చెయ్యదో కనుక్కుంటూ! మగవాడన్నవాడికి ఆమాత్రం హక్కు లేదూ?...'అరిసెలు చెయ్యకపోతే ఈరాత్రికి నిరశన వ్రతం చేస్తాను.'. అనుకొంటూ పెద్ద పెద్ద అంగలతో ఇంటికి చేరి ఛగాలున తలుపు గెంటాడు చంద్రం—

'నాన్నొచ్చాడోయ్! నాన్నొచ్చేడు!! నాన్న!!!' అంటూ పిల్లలు నల్గురూ ఒక్కసారిగా ఆ నేసరికి లేని నవ్వు ఎరువు తెచ్చుకొని 'అమ్మేదే?' అన్నాడు.

'నాన్న వచ్చేవరకూ మాట్లాడకుండా కూర్చున్న వాళ్ళకి చాలా అరిసెలు పెడ్తానంది అమ్మ—వంటింట్లో బూరెల మూకుడులో వేసి వండుతోంది' అన్నాడు పెద్ద కొడుకు భాస్కరం.

ఎప్పుడు బియ్యం నానబోసిందో? పిండి ఎప్పుడు కొట్టిందో? అయినా భారత మహిళకి భర్త కోరిక



శ్రీనివాసావారి

"టైగర్ రాముడు"లో

శ్రీమతి రాజసులోచన

తీర్చడంకన్నా జీవితలక్ష్యం మరొకటిలేదని తన భార్య బాగా గ్రహించుకొందికాబోలు! పిలిస్తేనేకాని వెళ్ళకూడదని పడకకుర్చీలో కూర్చున్నాడు చంద్రం. ఇంకా పిలవదేమా అని క్షణక్షణానికీ మనస్సులో ఆరాటం ఎక్కువై పోతోంది చంద్రానికి.

'ఒరేయ్! భాస్కరం! నేను వచ్చానని అమ్మకి చెప్పావా?' అని మెల్లిగా అడిగాడు చంద్రం. మళ్ళా తనమాట భార్యకి ఎక్కడ వినిపిస్తుందోనని.

పిల్లలందరూ వెళ్ళి ఒకరితర్వాత ఒకరుచొప్పున తల్లికి వార్త అందించారు నాన్న వచ్చాడని.

అయినా యింకా పట్టుకురాదేం చెప్మా... అన్నీ చల్లారిపోయాక తెస్తుందేమో! పోనీ అక్కడికి వెళ్ళి స్వయంగా చూస్తే?... అప్పుడే తనువచ్చి పదినిమిషాలైంది. ఇంక తట్టుకోలేకపోయాడు చంద్రం. భార్యను రప్పించేందుకు ఒక్కటే సాధనం. కుర్చీపట్టుకు నిల్చున్న చంటివాళ్ళు 'వెధవా! ఆ బురద చేతుల్తో కుర్చీ అంతా తగలేస్తున్నావా?' అంటూ వీపుమీద విమానంమోత మోగించాడు.

'చాల్లెండి-ఊరుకోండి. అనవసరంగా వాణ్ణెందుకు కొడ్తారు? ఇవిగో పూర్తయ్యాయి' అంటూ పళ్ళెంతో సహా తన శ్రీమతి ప్రత్యక్షమయ్యేసరికి, ఓ ప్లేటుతో వేడి వేడిగా అరిసెలు తన చేతికి అందివ్వడమే తడవుగా 'అరిసెల ఆరాటం'తో అలమటించే చంద్రం ఉపక్రమించాడు. చెడ్డ వేడిగా వున్నాయి.

అల్లాగే ఆపసోపాలుపడ్తూ గబగబా ఊదుకొని అరిసెల దొంతర్లు ఖాళీచేస్తున్నాడు చంద్రం. పిల్లలందరికీ తలా ఒక్కొక్కటీ చేతికిచ్చి 'ఇంకా వెయ్యనా:' అంటూ పళ్ళెంతో నిల్చుంది సుధ.

అంతలో ఎవరో కుర్రాడు వీధితల్పు గెంటి ఎదురుగా వరండాలో తెలుగు మాష్టారూ, పిల్లలూ అరిసెలు తింటూన్న దృశ్యం చూచి వెళ్ళి వీధిలో పదిమంది పిల్లలూ చేరి 'వేడివేడి అరిసె' అని అరుస్తోంటే; చంద్రం మనస్సులో పెట్రోలు మంటలా కోపం మండుతోన్నా, అరిసెలు హాయిగా గొంతుకలోనుంచి జారిపోతున్నాయి. అరిసెల ఆరాటం తీరిన ఆతని ముఖంలో ఆనందకాంతులు వెలిగాయ్.

# జీవితభీమా సంస్థ కొత్త వ్యాపారం!!

## 608 కోట్లకు పెరుగుదల.

1961 లో జీవితభీమా సంస్థ కొత్త వ్యాపారం అత్యున్నతంగా రు 608,75,10,000 కు చేరింది. ఇది 1960 లోని కొత్త వ్యాపారంకన్నా 22.3 శాతం పెరుగుదల చూపింది.

ఈ విషయాలను సంస్థ ఛైర్మన్, శ్రీ పి. ఏ. గోపాలకృష్ణన్ పత్రికా గోష్టిలో వెల్లడిచేశారు.

బ్రహ్మాండమైన ఈ పెరుగుదలకు గ్రామీణ ప్రాంతాలలో ప్రచారం తీవ్రంగా సాగటమేనని వారు తెల్పారు.

1948 లో సంస్థ ఖర్చు 15.87 శాతం వున్నది. ప్రస్తుత ఏడాదిలో ఖర్చు 13 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నారు.

సంస్థ ఇంతవరకు $12\frac{1}{2}$ లక్షల పాలసీలను అమలు చేసింది. ప్రపంచంలోకల్లా సంస్థ వ్యాపారం తృతీయ స్థానం అలంకరిస్తుంది.

సంస్థ నైపుణ్యాన్ని అభివృద్ధిపరచటానికి కార్యనిర్వాహక పద్ధతులు, నియమాలను పరిశీలించే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేయాలని వుద్దేశింపబడినట్లు ఛైర్మన్ తెల్పారు.


పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతం

ఆరోగ్యానికి బలానికి

Diamond Jubilee 1898 1958

ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.